సాక్షి
వికారాబాద్

శనివారం । 27 । ఏప్రిల్ । 2024




అర్హులందరికీ 'గ్యారంటీలు'

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం కోరారు. 8లో▸



బీజేపీతోనే దేశాభివృద్ధి

దేశ రక్షణ,అభివృద్ధికి బీజేపీతోనే సాధ్యమని పార్టీ భువనగిరి లోక్‌సభ అభ్యర్థి,మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. 8లో▸



గుంతలు పోయి..

పర్యాటక కేంద్రంగా పేరుగాంచిన అనంతగిరి గుట్ట రహదారులు పర్యాటకులకు చుక్కలు చూపెడుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

సకాలంలో ధాన్యం కొంటాం

మార్కెటింగ్ డీఎం నాగమణి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఎం నాగమణి, డీఎస్‌ఓ రాజేశ్వర్‌రావు

బొంరాస్‌పేట: యాసంగి సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని మార్కెటింగ్ శాఖ జిల్లా మేనేజర్ నాగమణి అన్నారు. శుక్రవారం మండలంలోని బొంరాస్‌పేట, మెట్లకుంట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఎస్‌ఓ రాజేశ్వర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో అవసరం మేరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. పంట కోతలు ఆలస్యంగా ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే ప్రారంభిస్తున్నారని వివరించారు. క్వింటాలు ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,203 మద్దతు ధర చెల్లించనున్నట్లు చెప్పారు. ధాన్యంలో తేమ 17శాతం ఉండాలన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేదన్నారు. రైతులు తక్కువ ధరకు ధాన్యం విక్రయించి మోసపోరాదని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం కిష్టప్ప, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అశోక్‌కు ఉగాది పురస్కారం

29న ఢిల్లీలో ప్రదానం



తాండూరు టౌన్: పట్టణానికి చెందిన ఫైన్ ఆర్ట్ అండ్ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు, జానపద కళాకారుడు ఎల్ అశోక్‌కు ఉగాది పురస్కారం దక్కింది. ఈ నెల 29న ఢిల్లీలోని లోక్ కళామంచ్‌లో శిఖరం ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో 2024 సంవత్సరానికి గాను జానపద విభాగంలో జాతీయ స్థాయి పురస్కారం అందజేయనున్నారు. తెలంగాణలో అంతరించి పోతున్న జానపద కళలను ప్రదర్శనల రూపంలో అందరికీ తెలిసేలా చేస్తున్న అశోక్‌కు అవార్డు దక్కడంపై తాండూరు వాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. కళా ప్రదర్శనలో తనకు అండగా నిలుస్తున్న తాండూరు పుర ప్రముఖులు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా వీడ్కోలు



అమిత్ నారాయణకు బహుమతి అందజేస్తున్న కలెక్టర్

అనంతగిరి: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సేవలందించడం అదృష్టంగా భావించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. ట్రైనీ కలెక్టర్ అమిత్ నారాయణ ఏడాది శిక్షణ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకొని వెళుతున్న సందర్భంగా శుక్రవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ క్యాడర్‌లో మంచి పోస్టింగ్ వచ్చి, ప్రభుత్వ ఉద్యోగిగా సర్వీసు చేయడం అదృష్టమన్నారు. అమిత్ నారాయణ సేవలను కొనియాడారు. భవిష్యత్‌లో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం ట్రైనీ కలెక్టర్ అమిత్ నారాయణ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆధ్వర్యంలో ఏ సమస్య రాకుండా శిక్షణ పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, ఆర్డీఓలు ఆయనతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం జిల్లాకు ట్రైనీ కలెక్టర్‌గా వచ్చిన ఉమా హారతికి స్వాగతం పలికారు.

వికారాబాద్ ఐసీటీసీ సెంటర్‌కు అవార్డు



అనంతగిరి: ఎయిడ్స్ వ్యాధి నివారణలో విశేష కృషి చేసినందుకు గాను వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలోని ఐసీటీసీ సెంటర్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు లభించిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంచంద్రయ్య తెలిపారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణలో సంస్థ మూల్యాంకణం ప్రకారం హెచ్ఐవీ పరీక్షల్లో నాణ్యత ప్రమాణాలను పాటించినందుకు గాను ఈ అవార్డు లభించింది. జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ తరఫున 5 స్టార్ క్వాలిటీని సాధించినందుకు గాను ఎక్స్‌లెన్స్ సర్టిఫికెట్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఐసీటీసీ సెంటర్ సిబ్బందిని అభినందించారు.

అనుబంధ ఓటరు జాబితా విడుదల



తుది జాబితాతో పోలిస్తే స్వల్పంగా తగ్గిన ఓటర్లు

- వివిధ కారణాలతో 9,228 ఓట్ల తొలగింపు
- జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 9,83,740

వికారాబాద్: ఎన్నికల కమిషన్ శుక్రవారం అనుబంధ ఓటరు జాబితాను విడుదల చేసింది. జనవరి 23న ఓటరు తుది జాబితాను విడుదల చేసిన ఈసీ ఈ నెల 19వ తేదీ వరకు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించింది. దాదాపు మూడు నెలల పాటు దరఖాస్తులు స్వీకరించిన అధికారులు.. కొత్త ఓటర్లతో కలిపి అనుబంధ జాబితాను విడుదల చేశారు. జిల్లాలో కొత్తగా 9,372 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేశారు. వివిధ కారణాలతో 1,021 దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన 8,351మందిని అర్హులుగా గుర్తించారు. పరిగిలో 2,293మంది, వికారాబాద్‌లో 1,512 మంది, తాండూరులో 2,651మంది, కొడంగల్‌లో 1,895 మంది కొత్తగా ఓటు హక్కు పొందారు. ఒక వ్యక్తి రెండు అంతకంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు పొందడం, నియోజకవర్గం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లడం, పెళ్లిళ్లు చేసుకొని వేరే చోటికు వెళ్లిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించారు. ఈ కారణంగా అనుబంధ జాబితాలో ఓటర్లు స్వల్పంగా తగ్గారు.

అనుబంధ జాబితా తరువాత..

ఎన్నికల కమిషన్ తాజాగా ప్రకటించిన అనుబంధ జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం ఓటర్లు 9,83,740 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 4,85,748మంది, స్త్రీలు 4,97,957మంది, ట్రాన్స్‌జెండర్లు 35మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. వికారా బాద్‌లో 2,31,717 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,15,041 మంది, మహిళలు 1,16,662 మంది, ట్రాన్స్ జెండర్లు 14 మంది ఉన్నారు. తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్‌లో 2,43,244 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,17,875 మంది, మహిళలు 1,25,365 మంది, ట్రాన్స్ జెండర్లు 7 మంది ఉన్నారు. పరిగి నియోజకవర్గంలో 2,66, 819 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,33,818 మంది, మహిళలు 1,32,992 మంది, 9 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. కొడంగల్‌లో 2,41,960 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,19,017మంది, మహిళలు 1,22,938 మంది, ట్రాన్స్ జెండర్లు ఐదుగురు ఉన్నారు.

మూడు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికం

జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడింటిలో మహిళా ఓటర్లే అధికంగా ఉండటం విశేషం. పరిగి నియోజకవర్గంలో మాత్రమే స్వల్పంగా పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు. వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. పరిగిలో పురుష ఓటర్ల కంటే 826మంది మహిళా ఓటర్లే అధికంగా ఉన్నాయి. వికారాబాద్‌లో 1,621 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. తాండూరులో ఏకంగా 7,490 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. కొడంగల్‌లో 3,921 మంది అధికంగా ఉన్నారు. ఓవరాల్‌గా జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 12,209 మంది అధికంగా ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో 1,148 పోలింగ్ కేంద్రాలను జిల్లా అధికారులు ఎంపిక చేశారు.

నామినేషన్ల పరిశీలన!

- కాసాని నామినేషన్‌పై అభ్యంతరాలు
- పార్టీ లీగల్ సెల్ హామీతో అనుమతి
- 64 మంది 88 నామినేషన్లు దాఖలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల లోక్‌సభ స్థానానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను శుక్రవారం రిటర్నింగ్ అధికారులు పరిశీలించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ దాఖలు చేసిన నామినేషన్ పత్రంలో ఓ కేసుకు సంబంధించిన వివరాలను దా చి పెట్టారని ఫిర్యాదు అందడం ఉత్కంఠకు దారి తీసింది. 2022 అక్టోబర్ నుంచి 2023 అక్టోబర్ వరకు ఆయన టీడీపీ తెలంగాణ అధ్యక్షుడిగా పని చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించగా, అదే పార్టీలోని రెండు వర్గాల మధ్య గొడవ చోటు చేసుకుంది. ఈ ఘటనపై ఒక వర్గం..మరో వర్గంపై ఫిర్యాదు చేసుకుంది. ఫిర్యాదులో కాసాని పేరును సైతం చేర్చారు. ఈ అంశంపై ఓ వ్యక్తి రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయడం ఉత్కంఠకు కారణమైంది. అయితే.. పోలీసులు కోర్టుకు సమర్పించిన ఛార్జిషీట్‌లో ఆయన పేరు లేక పోవడంతో ఆయన ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో ఈ వివరాలను పొందుపర్చలేదు. అభ్యర్థి కాసాని సహా బీఆర్‌ఎస్ లీగల్ సెల్ బృందం రిటర్నింగ్ సెంటర్‌కు చేరుకుని హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది. చివరకు ఆయన నామినేషన్ ఆమోదం పొందినట్లు తెలిసింది. 18 నుంచి 25 వరకు మొత్తం 64 మంది 88 నామినేషన్లు దాఖలు చేయగా.. రిటర్నింగ్ అధికారులు ఒక్కో నామినేషన్‌ను నిశితంగా పరిశీలించారు. వివరాలు సరిగా లేని వారి నామినేషన్లను తిరస్కరించారు.

నామినేషన్ల వివరాలు

లోక్‌సభ స్థానం	అభ్యర్థులు	నామినేషన్లు	తిరస్కరణ	ఆమోదం
చేవెళ్ల	64	88	17	47
భువనగిరి	61	-	10	51
మహబూబ్‌నగర్	41	42	7	35
నాగర్‌కర్నూల్	34	53	13	21

కాంగ్రెస్‌కు ఓటమి భయం

- అందుకే సీఎం రేవంత్ విచిత్రంగా మాట్లాడుతున్నారు
- పాలమూరులో బీజేపీ గెలుపు ఖాయం
- పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, లోక్‌సభ అభ్యర్థి డీకే అరుణ



విలేకరులతో మాట్లాడుతున్న డీకే అరుణ

కొడంగల్: కాంగ్రెస్ పార్టీకి ఓటమి భయం పట్టుకుందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ లోక్‌సభ అభ్యర్థి డీకే అరుణ ఆరోపించారు. శుక్రవారం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఆమె సాయంత్రం కొడంగల్‌లోని పున్నం చంద్ నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాలమూరులో బీజేపీ గెలుపు ఖాయమన్నారు. ఉమ్మడి పాలమూరులో బీజేపీ బలం పెరిగిందని భావించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచిత్రంగా మాట్లాడుతున్నారని అన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు రేవంత్ ఎమ్మెల్యేగా ఉన్నారని అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి కోసం గతంలో కోట్ల రూపాయలు మంజూరు చేయించినట్లు చెప్పారు. ప్రస్తుత ఎన్నికల్లో తాను ఎంపీగా గెలిస్తే కేంద్ర ప్రభుత్వంలో మంచి స్థానం లభిస్తుందన్నారు. తాను కేంద్ర మంత్రిగా ఉంటే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. జీఓ 69ను, జీఓ 72ను తాను మంత్రిగా ఉన్నప్పుడు తెచ్చామని గుర్తు చేశారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఇప్పుడున్న డీపీఆర్ ప్రకారం శ్రీశైలం ప్రాజెక్టు నుంచి సాగునీరు తేవడం సాధ్యం కాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే జూరాల నుంచి సాగునీరు తెచ్చి పాలమూరు ఎంపీ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు సాగునీరు ఇవ్వాలన్నారు. జూరాల నుంచి సాగునీరు తెస్తే కొడంగల్‌తో పాటు నారాయణపేట, మక్తల్, దేవరకద్ర, మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్ నియోజకవర్గాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందన్నారు. తాను ఎంపీగా గెలిస్తే సాగునీరు, రైల్వే లైన్ పనులను పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు నాగూరావ్ నామాజీ, వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానందరెడ్డి, ప్రభారీ రాజవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పున్నం చంద్‌లాహోటీ, నియోజకవర్గ కన్వీనర్ కొండ్రు నర్సింలు, మున్సిపల్ టౌన్ అధ్యక్షుడు సర్వేశ్వర్, కో కన్వీనర్ కోటకొండ రాము తదితరులు పాల్గొన్నారు.

రేవంత్.. జిమ్మిక్కు రాజకీయాలు మానుకో

దౌల్తాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో జిమ్మిక్కు రాజకీయాలు మానుకోవాలని బీజేపీ అభ్యర్థి డీకే అరుణ హితవు పలికారు. శుక్రవారం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దమ్ముంటే కొడంగల్ అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీకి వస్తున్న ఆదరణను చూసి కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా నోటికొచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. దేశ భవిష్యత్ కోసం ప్రజలు మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. రామరాజ్యం కావాలంటే బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో నాయకులు బంటు రమేష్, నాగురావునామాజీ, ప్రతాప్ రెడ్డి, మదన్, నర్సింలు, సతీష్ పాల్గొన్నారు.

రామరాజ్యంతో సుభిక్షం

బొంరాస్‌పేట: రామరాజ్యం తోపాటు ప్రధాని మోదీ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉంటారని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. శుక్రవారం బొంరాస్‌పేట, దుద్యాల మండల కేంద్రాల్లో ప్రచారం నిర్వహించారు. బీజేపీతో మంచి రోజులు వస్తాయన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు ఎక్కడా? అని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు నాగూరావు నామాజీ, వైస్ ఎంపీపీ, బీజేపీ నాయకుడు శ్రావణ్ కుమార్‌గౌడ్, పున్నం చంద్, బాబాయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

వేల కోట్లు ఉన్నా కొండా వేస్ట్

- ప్రజలకు ఖర్చు పెట్టే మనస్సు లేదు
- నియోజకవర్గంలో నలుగురిని కూడా గుర్తు పట్టలేరు
- కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి
- మరోసారి ఎంపీగా గెలిపించాలని వినతి

తాండూరు రూరల్: బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వద్ద ఎన్ని వేల కోట్లు ఉన్నా వేస్టేనని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజలకు ఖర్చు పెట్టే మనస్సు ఆయనకు లేదని విమర్శించారు. శుక్రవారం మండలంలోని మల్కాపూర్, కరన్‌కోట్ గ్రామాల్లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ మతం పేరుతో రాజకీయం చేస్తోందని విమర్శించారు. ఆ పార్టీ గెలిస్తే ఉచిత పథకాలు ఇవ్వదన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు చేవెళ్లకు చేసిందేమీ లేదన్నారు. నియోజకవర్గంలో నలుగురిని కూడా గుర్తు పట్టలేరని ఎద్దేవా చేశారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు దూరంగా ఉన్నారని ధ్వజమెత్తారు. తన ఆస్పత్రిలో రోగులకు ఒక్క రూపాయి కూడా తక్కువ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. మరోసారి తనను ఎంపీగా ఆశీర్వదిస్తే ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రజలకు సేవ చేస్తా: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

నన్ను నమ్మి గెలిపించిన తాండూరు ప్రజలకు రుణపడి ఉంటానని, వారికి సేవ చేస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల తర్వాత తాండూరు అభివృద్ధిపై దృష్టి పెడతానని పేర్కొన్నారు. జూన్ 4 తర్వాత ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాగప్ప, నాయకులు ధారాసింగ్, ఉత్తమ్‌చంద్, జనార్దన్‌రెడ్డి, సంపత్ కుమార్, రవిగౌడ్, శ్రీను, రాందాస్, రవిసింధే, రఘునాథ్‌రెడ్డి, పండరి, విజయలక్ష్మి, జగదీష్, రాజ్ కుమార్, శరణుబసప్ప, శివకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్సే

లోక్‌సభ ఎన్నికల అనంతరం కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. సాయిపూర్‌లో వారు మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, జెడ్పీటీసీ ధారాసింగ్, కౌన్సిలర్లు రత్నమాల, నీరజ, ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అబ్దుల్ రవూఫ్, పురుషోత్తంరావు, హబీబ్ లాలా, రాకేష్, మల్లప్ప, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తాం

తాండూరు: జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తామని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరులోని హిమాలయ హాల్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టులు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండాలన్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధికి డీపీఆర్ సిద్ధం చేసినట్లు తెలిపారు. శివసాగర్ పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. జుంటిపల్లి ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయించి పనులు జరిపిస్తామని పేర్కొన్నారు. పాత తాండూరు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రైల్వే గేట్ వద్ద బ్రిడ్జి నిర్మిస్తామని చెప్పారు. మొదటి నుంచి తాండూరు ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలమన్నారు.

తనిఖీల్లో పట్టుబడిన నగదుకు రశీదు ఇవ్వండి

షాద్‌నగర్ ఆర్డీఓ వెంకట మాధవరావు

కేశంపేట: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన తనిఖీల్లో పట్టుబడిన నగదుకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని షాద్‌నగర్ ఆర్డీఓ వెంకటమాధవరావు అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని కొనాయపల్లిలో స్టాటికల్ సర్వేలైన్స్ బృందం(ఎస్ఎస్‌టీ) ఏర్పాటు చేసిన చెక్ పోస్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. తనిఖీ సమయంలో వాహనాల నంబర్లను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ అజీంఅలీ, ఆర్ఐ నివేదిత పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపేస్తాం

ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ సతీశ్

యాచారం: రోడ్డు భవనాల శాఖ నిధులతో చేపట్టే రోడ్ల అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే, బిల్లులు నిలిపేసి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని రోడ్డు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ సతీశ్ హెచ్చరించారు. నందివనపర్తి గ్రామంలో ఆర్ అండ్ బీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును శుక్రవారం క్వాలిటీ కంట్రోల్ బోర్డు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్డును నాణ్యత, క్యూరింగ్ తదితర వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాశ్వతంగా ఉండే రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు.

ఆర్మీ జవాన్ వద్ద లంచం తీసుకున్న కేసులో..

- డిప్యూటీ తహసీల్దార్, రికార్డు అసిస్టెంట్‌పై వేటు

కొందుర్గు: పాత పహాణీ, ఆర్ఓఆర్‌లు ఇచ్చేందుకు లంచం తీసుకున్న డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య, రికార్డు అసిస్టెంట్ బాల్‌రాజ్ సస్పెండ్ అయ్యారు. సోషల్ మీడియా పోస్టు ఆధారంగా విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు గురువా రం ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కార్యాల యం నుంచి ఉత్తర్వులు జారీ కాగా శుక్రవా రం తహసీల్దార్ రమేశ్‌కుమార్ కిష్టయ్య, బాల్‌రాజ్‌లకు అందజేశారు. మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ అశోక్ రెడ్డి తన తండ్రి వారసత్వంగా వచ్చిన భూమి పాత రికార్డుల కోసం 2024 ఫిబ్రవరిలో కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. రోజులు గడిచినా అతడికి పాత రికార్డులు ఇవ్వలేదు. దీంతో ఆయన మార్చి 7న కార్యాలయానికి చేరుకుని రికార్డులు ఇవ్వాలని కోరగా ఇందుకు రూ.40 వేలు డిమాండ్ చేశారు. దీంతో అశోక్‌రెడ్డి అప్ప ట్లో కార్యాలయంలో పనిచేసే ప్రైవేట్ వ్యక్తి హేమంత్‌కుమార్‌కు ఫోన్‌పే నుంచిరూ.9వేలు, రికార్డు అసిస్టెంట్ బాల్‌రాజ్‌కు కొంత నగదు ఇచ్చారు. ఈ విషయమై ఆర్మీ జవాన్ ఓ సెల్ఫీ వీడియోను సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. విచారణ చేసిన ఉన్నతాధికారులు ఇద్దరు అధికారులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: లోకసభ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. ఎన్నికల ఏర్పాట్లపై శుక్రవారం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిందని, అనుబంధ ఓటరు జాబితా విడుదల చేశామని తెలిపారు. ఈ జాబితా ప్రతులను నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులకు అందజేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ నంబర్, పూర్తి చిరునామా సరిగ్గా ఉందో లేదో చెక్ చేసుకోవాలన్నారు. ప్రచార సభలు, సమావేశాలకు రాజకీయ పార్టీల ప్రతినిధుల, అభ్యర్థుల నుంచి వచ్చే దరఖాస్తులను వెంటనే పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఓటరు స్లిప్పులు కుటుంబ సభ్యులకే అందజేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్, ఫాం – 12కు సంబంధించి రెండు రోజుల్లో పూర్తి చేసి కవరింగ్ లెటర్‌తో సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందజేయాలని ఆదేశించారు. ఇతర జిల్లాల ఉద్యోగులకు సంబంధించి ఓటరు ప్రత్యేక సెంటర్ ఏర్పాటుకు ప్లాన్ చేయాలన్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు, ఓపీఓలకు మాస్టర్ ట్రైనర్లతో రెండో విడత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించాలని, ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలు పకడ్బందీగా పని చేయాలని ఆదేశించారు. కేంద్రాల వారీగా ఎన్నికల సామగ్రిని చెక్ చేసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, దివ్యాంగుల కోసం వీల్ చైర్స్, నీడ కోసం టెంట్లు సమకూర్చుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, వాసు చంద్ర, శ్రీనివాష్ రావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు కృషి చేయాలి

- ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ కాలురామ్ రావత్

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాలని ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ కాలురామ్ రావత్ తెలిపారు. శుక్రవారం వికారాబాద్‌లోని మేరీనాట్స్ స్కూల్‌లోని ఈవీఎం, వీవీ ప్యాట్ల స్ట్రాంగ్‌రూమ్‌ను ఎస్పీ కోటిరెడ్డి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మతో కలిసి పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్, వికారాబాద్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మ ఆయనకు ఘన స్వాగతం పలికారు.



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కాలురామ్ రావత్

క్లుప్తంగా

లెక్క పక్కాగా ఉండాలి

ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజీవ్ చోప్రా

పరిగి: లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగేలా పనిచేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజీవ్ చోప్రా అధికారులకు సూచించారు. శుక్రవారం పరిగి ఏఆర్‌ఓ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. అభ్యర్థుల ఖర్చు వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పక్కాగా నమోదు చేయాలని, అభ్యర్థులకు సంబంధించి ప్రచార వాహనాలను, పాంప్లెట్స్ తదితర వివారలను తెలుసుకుని ఖర్చు ఎంతపెట్టారో వాటి వివరాలను తెలుసుకొని పక్కాగా నమోదు చేయాలన్నారు. అభ్యర్థుల ప్రచారాలపై పటిష్ఠ నిఘా పెట్టాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్‌ఓ వాసుచంద్ర, తహసీల్దార్ ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి

డీఎస్‌ఓ రాజేశ్వర్

పరిగి: వరిధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని డీఎస్‌ఓ రాజేశ్వర్ సూచించారు. పట్టణ కేంద్రంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించాలన.. ప్రభుత్వం మంచి మద్దతు ధర కలిప్తుందన్నారు. ధాన్యం విక్రయించిన పది రోజుల్లోనే డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. సివిల్ సప్లై డీఎం సుగుణబాయి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎస్‌ఐపై చర్యలు తీసుకోండి

ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర హైకోర్టు

పరిగి: తప్పుడు కేసులు నమోదు చేసి విచారణ పేరుతో ఓ గిరిజన యువకుడిని వేధిస్తున్న పరిగి ఎక్సైజ్ ఎస్‌ఐ దయాసాగర్‌పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హైకోర్టు శుక్రవారం అధికారులను ఆదేశించింది. వివరాలు.. చౌడాపూర్ మండల పరిధిలోని చాకల్‌పల్లితండా(చిన్నమంగ్యతండా)కు చెందిన మూడవత్ శంకర్ తనపై ఎక్సైజ్ ఎస్‌ఐ దయాసాగర్ అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నాడని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. అతనిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బాధితుడు హైకోర్టులో రిట్ పిటిషన్ వేశాడు. శంకర్ నమోదు చేసిన రిట్ పిటిషన్‌పై వాదనలు విన్న రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ విజయసేన్‌రెడ్డి.. ఎక్సైజ్ ఎస్‌ఐ దయాసాగర్‌పై చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీచేసింది.

ఆర్టీసీ డ్రైవర్లపై దాడులకు పాల్పడితే చర్యలు: ఎస్పీ

అనంతగిరి: ఆర్టీసీ ఉద్యోగులపైన దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎవరైనా ఆర్టీసీ ఉద్యోగులపైన దాడులకు పాల్పడినా, వారిని బెదిరింపులకు గురిచేసినా, వేధింపులకు పాల్పడినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా విధుల్లో పాల్గొనాలని.. మీవెంట పోలీస్ డిపార్ట్‌మెంట్ ఉంటుందని భరోసా పలికారు. దాడులు, బెదిరింపులకు గురైతే డయల్ 100 కు గాని తమ పరిధిలోని పోలీస్ అధికారులకు గాని తెలియజేయాలని ఎస్పీ తెలిపారు. ఆర్టీసీ సిబ్బందిపై దాడిచేస్తే ఊరుకునేది లేదని ఎస్పీ స్పష్టం చేశారు.

అప్పులభారంతో వ్యక్తి ఆత్మహత్య


అనంతయ్య (ఫైల్)

ధారూర్: అప్పులభారం మోయలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని నాగారంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ముసలిగల్ల అనంతయ్య(42).. ఇటీవల నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. నిర్మాణం నిమిత్తం గ్రామంలోని తనకు తెలిసిన వారి వద్ద రూ.2లక్షల వరకు అప్పు తీసుకువచ్చాడు. ఈ అప్పులు తీర్చలేని స్థితిలో ఉండటంతో అనంతయ్య ఈనెల 22న పురుగుల మందు తాగి అస్వస్థకు గురై తానే వెళ్లి తాండూరు ఆస్పత్రిలో చేరాడు. అటునుంచి వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. శుక్రవారం మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డ్యామిట్.. కథ అడ్డం తిరిగింది

- వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భర్తను చంపించిన భార్య
- అనుమానాస్పద మృతిగా చిత్రీకరించే ప్రయత్నం
- పోలీసుల విచారణలో నేరం ఒప్పుకున్న నిందితురాలు
- సహకరించిన కొడుకు సహా మరో ఇద్దరి అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ శ్రీధర్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి, చిత్రంలో నిందితులు

బొంరాస్‌పేట: వివాహేతర సంబంధానికి అడ్డురావడంతో పాటు భర్త ఆస్తిని కాజేద్దామని చూసిన ఓ వివాహిత ప్లాన్ అడ్డం తిరిగింది. ఈనెల 11న మండల పరిధిలోని కొత్తూరులో చోటుచేసుకున్న వ్యక్తి అనుమానాస్పద మృతిని కేసును పోలీసులు ఛేదించారు. దీనిని హత్యగా వారు నిర్ధారించారు. కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి వెల్లడించిన వివరాలు.. బొంరాస్‌పేట మండలం కొత్తూరుకి చెందిన కుర్వ సుమలత, పెద్దకుర్వ నర్సింహులు భార్యా భర్తలు. అయితే అదే గ్రామానికి చెందిన మహ్మద్ బాబాతో సుమలతకు కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. ఈ క్రమంలో తమ సంబంధానికి భర్త అడ్డొస్తున్నాడని భావించిన సుమలతో.. బాబాతో కలిసి భర్తను చంపించాలని అనుకుంది. భర్త హత్యకు రూ.5లక్షల డబ్బు ఇస్తానని బాబాతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి 2న హత్యకు ప్లాన్ చేశారు. అదేరోజు వేరే ఊరెళ్లి తిరిగి వస్తున్న భర్త నర్సింహులను రాత్రిపూట స్వగ్రామానికి నడుచుకుంటూ రావాలని చెప్పి బాబాతో బొలెరో వాహనంతో గుద్దించాలని ప్రణాళిక వేశారు. అనుకున్నట్లే నిర్సింహులు నడుకుంటూ వస్తుండగా బొలేరోతో గుద్దించగా ప్రమాదంలో అదృష్టవశాత్తు అతడు చనిపోలేదు. కాలు మాత్రం విరిగింది. ఈ క్రమంలో బొలేరో వాహనం నడిపిన బాబాకు వాహనం బోల్తాపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ క్రమంలో గ్రామంలో నర్సింహులకు జరిగిన ప్రమాదం, గాయాల గురించి పంచాయితీ పెట్టి రూ.50వేలు ఇవ్వాల్సిందిగా బాబాకు జరిమానా విధించారు. ఈడబ్బులు కూడా బాబాకు బదులు ఎవరికీ తెలియకుండా సుమలత భరించింది. ఈ క్రమంలో భర్త నర్సింహులు కోలుకున్నాడు. అయితే భర్తను ఎలాగైనా హతమార్చాలని మరోసారి సుమలత, బాబా గట్టి ప్రణాళిక వేశారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఉంటున్న బాబా స్నేహితుడు పూడూరుకు చెందిన ఖాసీంకు రూ.2లక్షలు ఇచ్చి నర్సింహులును చంపాలని సుపారీ ఇచ్చారు. ఈ క్రమంలో ఈనెల 11న రాత్రి ఇంటిబయట కొడుకు ఆకాశ్‌ను కాపలా ఉంచిన సుమలత, ఖాసీం, బాబాతో కలిసి దిండుతో భర్త నర్సింహులు గొంతునొక్కి చంపేసింది. అనంతరం బాబా, ఖాసీం ఊరి నుంచి పరారయ్యారు. మృతుడి తల్లి పెద్దకుర్వ అంజిలమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు లోతుగా విచారణ జరపగా.. అసలు విషయం బయటపడింది. నేరాన్ని ఒప్పుకున్న నిందితులు సుమలత, ఆకాష్, బాబా, రవూఫ్‌పై హత్యాకేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ తెలపారు.

గంజాయి పట్టివేత

అనంతగిరి: వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గంజాయి తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో శుక్రవారం మధ్యాహ్నం 3:30గంటల సమయంలో వికారాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు గంజాయితో పట్టుబట్టారు. వీరివద్ద నుంచి 465 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరు వికారాబాద్‌కు చెందిన వారని.. బీదర్‌లోని ఓ వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి వికారాబాద్ పరిసరాల్లో విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది శివప్రసాద్, విష్ణువర్ధన్ రెడ్డి, రవికిరణ్ తదితరులు ఉన్నారు.

గౌతపూర్ చెక్‌పోస్టు వద్ద..

తాండూరు రూరల్: గౌతాపూర్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం కరన్‌కోట్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో గంజాయి కలిగిఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకోవడంతో పాటు వారిద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

అర్హులందరికీ ఆరు గ్యారెంటీలు


చీలాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఆనందం, నాయకులు

డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం

పూడూరు: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని వికారాబాద్ డీసీసీ ఉపాధ్యక్షుడు కడ్మూరు ఆనందం ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని చీలాపూర్‌లో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అర్హులందరికీ అందిస్తామన్నారు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని, అన్నివర్గాల ప్రజలకు అండగా ఉంటామని అన్నారు. హస్తం గుర్తుకు ఓటువేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పెంటయ్య, అజీంపటేల్, మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు మెజార్టీ తీసుకురావాలి


సమావేశంలో మాట్లాడుతున్న కేఎల్లార్

- మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి
- సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లను విజయవంతం చేయాలని పిలుపు

మహేశ్వరం: లోక్‌సభ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మంచి మెజార్టీ తీసుకురావాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కోరారు. నియోజకవర్గంలో ఈనెల 30, మే5న జరిగే సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లను విజయవంతం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం మండల పరిధిలోని తుక్కుగూడలో ఆయన మాట్లాడుతూ... చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఈనెల 30న జల్‌పల్లి, మీర్‌పేట్, బడంగ్‌పేట్, ఆర్‌కే పురం, సరూర్‌నగర్ డివిజన్లలో సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లో.. అలాగే వచ్చేనెల 5న మహేశ్వరం, కందుకూరు, ఇమాంగూడ, తుక్కుగూడలో రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు రెండూ ఒక్కటే అన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే బీజేపీకి ఓటేసినట్లే అవుతుందన్నారు. ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చేసితీరుతామన్నారు. త్వరలో అర్హులకు రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం, స్థలాల పంపిణీ, పట్టా కలిగిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.15 వేల పెట్టుబడి సహాయం అందిస్తామన్నారు. పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, సినీయర్ నాయకులు అమరేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పాండునాయక్, మాజీ ఎంపీటీసీ రాజు, రంగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి


చింతపట్లలో ప్రచారం నిర్వహిస్తున్న బూర నర్సయ్యగౌడ్, నాయకులు

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓటేసి వృథా చేసుకోవద్దు
- కేసీఆర్ పాలనలో ప్రజాప్రతినిధుల ఆత్మహత్యలు
- కమలంపువ్వు గుర్తుకు ఓటేసి గెలిపిస్తే సేవకుడి పనిచేస్తా
- భువనగిరి లోక్‌సభ అభ్యర్థి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

యాచారం: దేశ రక్షణ,అభివృద్ధికి బీజేపీతోనే సాధ్యమని పార్టీ భువనగిరి లోక్‌సభ అభ్యర్థి,మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మొండిగౌరెల్లి, చింతపట్ల, నల్లవెల్లి, యాచారం తదితర గ్రామాల్లో పర్యటించారు. మోదీ చేసిన అభివృద్ధి పనుల కరపత్రాలు ఇంటింటికీ పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓటేసి వృథా చేసుకోవద్దన్నారు. ఆ పార్టీలు ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి వచ్చేది లేదని, బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే ప్రయోజనం ఉండదన్నారు. పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ గ్రామాల్లోని అభివృద్ధి పనులకు పైసా నిధులు మంజూరు చేసింది లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో సీసీ రోడ్లు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, పల్లె ప్రగతి తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. కేసీఆర్ సర్కార్ నిధులు మంజూరు చేయకపోగా.. అప్పులు పాలైన ప్రజా ప్రతినిధులు ఆత్మహత్యలు చేసుకున్నారని విమర్శించారు. కమలం పువ్వు గుర్తుపై ఓటేసి తనను ఎంపీగా గెలిపిస్తే మీ సేవకుడిగా పనిచేస్తానని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అధిక నిధులు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు సాధ్యం కాదన్నారు. పంట రుణమాఫీ, రైతుబంధు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయకుండా మరోసారి మోసం చేసేందుకు చూస్తోందన్నారు. ఈ ప్రచారంలో యాచారం ఎంపీపీ కొప్పు సుకన్య, చింతపట్ల ఎంపీటీసీ సభ్యురాలు తాండ్ర లక్ష్మమ్మ, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల యాదగిరిరెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, మర్పల్లి మల్లేశ్, కుంచారాపు సందీప్‌కుమార్‌రెడ్డి, గొరిగే బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో రైతు మృతి

యాచారం: పాముకాటుకు గురై ఓ రైతు మృతి చెందిన సంఘటన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకులా మైలారంలో చోటు చేసుకుంది. పొల్కం జంగయ్య(55) శుక్రవారం మధ్యాహ్నం తన వ్యవసాయ క్షేత్రంలో ఆకుకూరలు తెంపుతుండగా ఆకుకూరల్లో ఉన్న పాము.. జంగయ్యను కాటేసింది. గుర్తించిన కుటుంబ సభ్యులు జంగయ్యను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ జంగయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు.

బైక్ నంబర్ ప్లేట్ మార్చి వినియోగం

సహకరించిన మరో ముగ్గురికి రూ.2వేల జరిమానా

ఆమనగల్లు: పాతసామాను కింద కొనుగోలు చేసిన బైక్.. రంగు, నంబర్‌ప్లేట్‌ను మార్చి దానిని ఇతరులకు అమ్మిన నలుగురికి ఆమనగల్లు ప్రథమ శ్రేణి న్యాయస్థానం జడ్జి రూ.2వేల చొప్పున జరిమానా విధించింది. వివరాలు.. 2021 సంవత్సరంలో ఆమనగల్లు పట్టణానికి చెందిన పాతసామాను కొనుగోలు చేసే ముజాహిద్.. గుర్తు తెలియని వ్యక్తి నుంచి బైక్‌ను కొనుగోలు చేశాడు. అనంతరం ఆ బైక్‌ను మహ్మద్ అఫ్సర్‌కు విక్రయించగా.. ఆమనగల్లుకు చెందిన ప్రేమ్‌కుమార్ మరొకరి సహాయంతో బైక్ రంగు, నంబర్ ప్లేట్‌ను మార్చి ఆ బైక్‌ను వినియోగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆమనగల్లు పట్టణంలో ప్రేమ్‌కుమార్ ఆ బైక్‌పై తిరుగుతుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడనిఎస్‌ఐ బల్‌రాం తెలిపారు. ఈ కేసుకు సంబంధించి నిందితులుగా ఉన్న ఆమనగల్లుకు చెందిన వసంత,మహ్మద్ అఫ్సర్, ప్రేమ్‌కుమార్, ముజాహిద్‌కు ఆమనగల్లు కోర్టు రూ.2 వేల చొప్పున జరిమానా విధించిందని ఎస్‌ఐ తెలిపారు. ఈ కేసు దర్యాప్తు పూర్తిచేసిన అప్పటి ఎస్‌ఐ ధర్మేశ్, సాక్షులను త్వరితగతిన హాజరుపరిచిన ఎస్‌ఐ బల్‌రాం, కోర్టు కానిస్టేబుల్ శంకర్‌ను షాద్‌నగర్ ఏసీపీ అభినందించారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

డీసీపీ నారాయణరెడ్డి

కడ్తాల్: అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన మైసిగండి, సాలార్‌పూర్, ఎక్వాయిపల్లిలో ఆయన పర్యటించారు. అక్కడ భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులతో చర్చించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతవరణంలో ఓటుహక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల కోడ్ పాటించని వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ తెలిపారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, ఎస్‌ఐ వరప్రసాద్ ఉన్నారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు


కందుకూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సూరజ్‌కుమార్

కందుకూరు: ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్.. అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని, పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. అందరికీ ఓటర్ స్లిప్‌లు అందేలా చూడాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై చర్యలు తప్పవన్నారు. వచ్చేనెల 1, 2వ తేదీల్లో జరిగే పీఓ, ఏపీఓ శిక్షణకు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్ తహసీల్దార్లు విజయలక్ష్మి, గోపాల్, మాధవిరెడ్డి, మీర్‌పేట, బడంగ్‌పేట మున్సిపల్ కమిషనర్లు చంద్రశేఖర్, రఘు, మహేశ్వరం, కందుకూరు ఎంపీడీఓలు శైలజారెడ్డి, సరిత, నాయబ్ తహసీల్దార్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం..

ఇబ్రహీంపట్నం రూరల్: లోక్‌సభ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలోకి ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గం వస్తుందన్నారు. ఇబ్రహీంపట్నంలో పురుష ఓటర్లు 1,70,807 మంది, స్త్రీలు 1,68,499 మంది ఉండగా మొత్తం నియోజకవర్గంలో 3,39,341 మంది ఓటర్లున్నారని తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ 343 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. అందులో 107 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించినట్లు వివరించారు. ఎన్నికల నిర్వహణ కోసం 172 ఇన్‌సైడ్ వెబ్‌కాస్టింగ్, 55 అవుట్‌సైడ్ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పోస్టల్ ఓటింగ్ కోసం ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఏర్పాట్లు చేశామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్‌రూం కూడా ఆర్డీఓ కార్యాలయంలోనే ఏర్పాటు చేశామని తెలిపారు. గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలోని పీజీ బ్లాక్‌లో ఈవీఎంల స్ట్రాంగ్‌రూం ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలు అయ్యేంత వరకు బొంగ్లూర్ ఔటర్ రింగ్‌రోడ్డు, ఆగాపల్లి ఎక్స్‌రోడ్డు, కొత్తగూడెం చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు నిర్వహించిన తనిఖీల్లో రూ.9,08,4,485 లక్షల నగదు పట్టుబడిందని, 2,027 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామన్నారు. రూ.1,67,09,550 లక్షల విలువైన డ్రగ్స్‌ను సీజ్ చేసి నిందితులను అరెస్టు చేశామన్నారు. ఓటింగ్ కోసం 5 మహిళా పోలింగ్ స్టేషన్లు, వికలాంగులకు, యువతకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఓటర్లు నిర్భయంగా ఓటు వేయాలని కోరారు.

పోగొట్టుకున్న పర్స్ అప్పగింత

సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించిన పోలీసులు

ఆమనగల్లు: ఆమనగల్లు కూరగాయల మార్కెట్లో పర్స్ పోగొట్టుకున్న బాధితుడి పర్స్‌ను పోలీసులు వెంటనే గుర్తించి తిరిగి అప్పగించారు. వివరాలు.. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండ తండాకు చెందిన బిచ్యా శుక్రవారం ఆమనగల్లు కూరగాయల మార్కెట్‌లో కొనుగోలు చేస్తుండగా తన పర్స్‌ను పోగొట్టుకున్నాడు. వెంటనే విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. స్పందించిన పెట్రోల్ మొబైల్ కానిస్టేబుల్ శివకుమార్, సీసీ టీవీ ఇన్‌చార్జి కానిస్టేబుల్ రఘునాయక్ సీసీ కెమెరాల సహాయంతో పర్స్‌ను తీసుకున్న వ్యక్తిని గుర్తించి అతనివద్ద నుంచి పర్స్‌ను బాధితుడు బిచ్యాకు అందించారు. బాధితుడికి న్యాయం చేయడంతో పాటు, చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ శివకుమార్, రఘునాయక్‌ను ఎస్‌ఐ బల్‌రాం అభినందించారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తాచాటాలి

పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి


రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల స్థానం నుంచి గెలుపు కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేలా ఉండాలని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం శంకర్‌పల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో దోబిపేట గ్రామంలోని వివిధ పార్టీల నాయకులు హస్తం గూటికి చేరారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్, పార్టీ మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి రంజిత్‌రెడ్డి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్‌లో భారీ మెజార్టీతో గెలిచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కానుక అందించేలా పార్టీ కార్యకర్తలు, నాయకులు పనిచేయాలన్నారు. కష్టపడిన వారికి భవిష్యత్‌లో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. తన గెలుపు కోసం పనిచేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ గెలుపుకోసం పనిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు, మున్సిపల్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే బలం

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

చేవెళ్ల: బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే బలం అని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ యూత్ ఇన్‌చార్జిగా ముడిమ్యాలకు చెందిన వంగ శ్రీధర్‌రెడ్డిని నియమిస్తూ చేవెళ్ల బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే యాదయ్య, ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌తో కలిసి సబితారెడ్డి నియామకపత్రం అందజేశారు. సబితారెడ్డి మాట్లాడుతూ. పదవులు అనుభవించిన కొందరు నాయకులు వారి స్వార్థం కోసం పార్టీలు మారుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాలుగు నెలలు దాటినా ఇంతవరకు ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను గెలిపించుకొని కేసీఆర్‌కు కానుకగా ఇద్దామన్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. నూతనంగా ఎన్నికైన నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ..తనపై నమ్మకంతో పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని చెప్పారు. యూత్ నాయకులతో కలిసి లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు కోసం పనిచేస్తానని చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకులు ప్రభాకర్, యాదగిరి, శేరి రాజు, సాయినాథ్, రామగౌడ్, మాధవ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.